క్లుప్తంగా

గర్భిణులకు వైద్యపరీక్షలు

దస్తురాబాద్: అన్ని సౌకర్యాలున్న ప్రభుత్వ ఆసుపత్రిలోనే గర్భిణులు ప్రసవాలు చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని రేవోజీపేటలో 25 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అంతకుముందు దస్తురాబాద్ ఆశ్రమోన్నత పాఠశాలలో 118 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. ఆరోగ్యవిస్తరణాధికారి కన్నయ్య, హెల్త్ సూపర్‌వైజర్ లలిత, వైద్యసిబ్బంది రాజేందర్, వరలక్ష్మి, జ్యోతి, జంగుబాయి, మంజుల, సుజాత, లక్ష్మి తదితరులు ఉన్నారు.

సోన్ ఎంఈఓగా పరమేశ్వర్



సోన్: మండలంలోని జాఫ్రపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న తొడిశెట్టి పరమేశ్వర్ బుధవారం ఇన్‌చార్జి ఎంఈఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. వారికి పాఠశాలల ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్మణచాంద ఎంఈఓగా అశోక్‌వర్మ..



లక్ష్మణచాంద: మండలానికి ఇన్‌చార్జి ఎంఈఓగా వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌వర్మ నియమితులయ్యారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంఈవోకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి



నారాయణరావును సన్మానిస్తున్న నేతలు

భైంసాటౌన్: నియోజకవర్గంలో మండలాల వారీగా మహిళా సంఘాలను బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి అన్నారు. బుధవారం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్‌ను తన నివాసంలో కలిసి విన్నవించారు. ఈసందర్భంగా వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, గంగారెడ్డి, మహిళలు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కేజీబీవీని బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌ఐ వేణుగోపాల్ తదితరులున్నారు.

బోరు పనులు ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్ కాలనీలో ఉన్న కొత్తవాడలో నూతన బోరు పనులను మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ప్రారంభించారు. కాలనీలో నీటి ఎద్దడి నెలకొనడంతో కౌన్సిలర్ విజ్ఞప్తి మేరకు బోరు వేసినట్లు చైర్మన్ తెలిపారు. అంతకుముందు పట్టణంలోని 1, 10, 11 వార్డుల్లో పలువురికి వంటగ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేశారు. కమిషనర్ మనోహర్, వైస్‌చైర్మన్ కావలి సంతోష్, నాయకులు తొంటి శ్రీనివాస్, జన్నారపు శంకర్, తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరం ఉండాలి

భైంసాటౌన్: పట్టణంలోని విద్యాభారతి జూనియర్ కళాశాలలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కౌన్సిల్ జిల్లా డైరెక్టర్ దత్తుసింగ్, ముధోల్ డైరెక్టర్ సాప పండరి, వైస్‌చైర్మన్ పెంటాజి, అధ్యాపకులు ఉన్నారు.

'ఆయిల్‌పాం'పై అవగాహన

సోన్: మండలంలోని న్యూవెల్మల్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆయిల్‌పాం సాగుపై జిల్లా ఆయిల్‌పాం డివిజనల్ మేనేజర్ వనోజ్‌రెడ్డి.. రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో 260 మంది రైతులు 630 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాక్‌పట్లలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయన్నారు. సబ్సిడీ తమ ఖాతాల్లో జమ కాలేదని.. నెలకోసారి తమ తోటలను పరిష్కరించాలని రైతులు కోరారు. ఏఈఓ ఉమమహేశ్వరి, రైతులు కొండ రవి, నర్సింగ్‌రావు, భూమారెడ్డి, నవీన్‌రెడ్డి, నాగయ్య, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి వినతి

మామడ: తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండలంలోని రాంపూర్ గ్రామస్తులు బుధవారం నిర్మల్‌లో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు వినతిపత్రం అందించారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరగా డీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంతోష్, జైసింగ్ ఉన్నారు.

ఒంటికీ..రెంటికీ ఇబ్బందులే..

సోన్: ప్రైవేటుకు దీటుగా సర్కారుబడుల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు, పాలకులు పేర్కొంటున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఒంటికీ, రెంటికీ వెళ్లేందుకు సోన్ మండలంలోని సోన్, న్యూవెల్మల్‌బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆయా పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



న్యూవెల్మల్‌బొప్పారంలో ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో మరుగుదొడ్లు

- అసంపూర్తిగా మరుగుదొడ్లు, మూత్రశాలలు
- సోన్, న్యూవెల్మల్‌బొప్పారం బడుల్లో విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

సోన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

సోన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 230 మంది విద్యార్థులు చదువుతున్నారు. బాలికలు 130, బాలురు 100. గతంలో మన ఊరు మన బడిలో భాగంగా బాలికలకు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించారు. బాలురకు తాత్కాలికంగా మూత్రశాలలను ఏర్పాటు చేశారు.. కానీ మరుగుదొడ్లు లేవు. బాలురకు నాలుగు మరుగుదొడ్లు, 36 మూత్రశాలలను నిర్మించేందుకు ఉపాధిహామీ పథకం కింద రూ.32 లక్షలు కేటాయించారు. ఈ పనులు తొంభై శాతం వరకు పూర్తయ్యాయి. బాలురు మాత్రం ఒంటికి, రెంటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా మూత్రశాలలు ఏర్పాటు చేసినా మరుగుదొడ్లు మాత్రం లేవు.



న్యూవెల్మల్‌బొప్పారంలో పాఠశాల

న్యూవెల్మల్ బొప్పారం పాఠశాలలో..

సోన్ మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 214 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 107 మంది బాలికలు కాగా.. 107 మంది బాలురు. ఇక్కడా 107 మంది బాలికలకు ఒకే మూత్రశాల, మరుగుదొడ్డి ఉంది. బాలురకు అసలే లేవు. దీంతో వారు ఒంటికి, రెంటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఉపాధిహామీ పథకం కింద రూ.37లక్షలు కేటాయించారు. ఈ నిధులతో బాలురకు 20 మూత్రశాలలు, నాలుగు మరుగుదొడ్లు, బాలికలకు 16 మూత్రశాలలు, నాలుగు మరుగుదొడ్లు, సిబ్బందికి నాలుగు మరుగుదొడ్లు నిర్మించాలని నిర్ణయించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిధులు రాకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు.

పనులు తొంభైశాతం పూర్తయినా..

సోన్, న్యూవెల్మల్ బొప్పారం పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించేందుకు కాంట్రాక్టర్ మురళీధర్‌రెడ్డి పనులు దక్కించుకున్నాడు. ఇప్పటికే రెండు పాఠశాలల్లో తొంభై శాతం పనులు పూర్తిచేశారు. కానీ ఇప్పటికీ ప్రభుత్వం ఒక్క రూపాయి మంజూరు చేయలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే వారంలో పనులు పూర్తి చేసి పాఠశాలలకు అప్పగిస్తానని కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు.

గోస పడుతున్నాం



మా జెడ్పీ ఉన్నత పాఠశాలలో 107మంది విద్యార్థినులకు ఒకే మూత్రశాల, మరుగుదొడ్డి ఉంది. దీంతో ఒంటికి, రెంటికీ వెళ్లేందుకు గోసపడుతున్నాం. అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.

– బొడ్డు తిరుమల, 9వ తరగతి, న్యూవెల్మల్‌బొప్పారం

పనులు పూర్తి చేయండి



మా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి. మా కష్టాలు ఎవరికీ చెప్పాలో తెలియడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– రామెల్లి తేజశ్రీ, 9వ తరగతి, న్యూవెల్మల్‌బొప్పారం

హాజరుశాతం తగ్గుతుంది..



మా పాఠశాలలో 214 మంది విద్యార్థులు చదువుతున్నారు. నా సొంత ఖర్చులతో బాలికలకు ఓ మరుగుదొడ్డిని నిర్మించి వినియోగంలోకి తీసుకొచ్చాం. అదీ సరిపోవడం లేదు.. బాలురకైతే అసలు మరుగుదొడ్లు, మూత్రశాలలే లేవు. దీంతో పాఠశాలకు వచ్చేవారి హాజరుశాతం తగ్గుతుంది. సమస్యను త్వరగా పరిష్కరించాలి.

– విద్యాసాగర్, హెచ్‌ఎం, జెడ్పీఎస్ఎస్, న్యూవెల్మల్‌బొప్పారం

పాఠశాల సమస్యలు పరిష్కరించాలి



గదిలో మద్యం సీసాలు చూపుతున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు, విద్యార్థులు బుధవారం ఆందోళన చేశారు. గతేడాది ఓ ఉపాధ్యాయురాలిని డిప్యుటేషన్‌పై పంపడంతో విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. సుమారు 50 మంది ఉన్నప్పటికీ ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తుండటంతో విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు విద్యార్థులతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడని దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. పాఠశాలలో చేసిన పనులకు బిల్లులు చెల్లించేందుకు జాప్యం చేస్తున్నారని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. పాఠశాల మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని తెలిపారు. అనంతరం అక్కడకు వచ్చిన కాంప్లెక్స్ హెచ్‌ఎం రమాదేవికి వినతిపత్రాన్ని అందించి సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టేకు గంగారాం, గ్రామస్తులు కరిపె రాజ్‌కుమార్, టేకు ప్రకాశ్, అమంద రాజ్‌కుమార్, ఒడ్నాల రాజేశ్వర్, టేకు తిరుపతి, రాజన్న, తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో ఎలుకల బెడద



మస్కాపూర్ కేజీబీవీ



ఏర్పాటుచేసిన ఎలుకల బోను

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు, సిబ్బంది
- కట్టడికి బోన్లు ఏర్పాటు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ కేజీబీవీలో ఎలుకలు రాజ్యమేలుతున్నాయి. ఈనెల 22న ఆదివారం కేజీబీవీలో తమ గదిలో నిద్రిస్తున్న పలువురు ఎనిమిదో తరగతి విద్యార్థినుల చేతివేళ్లను ఎలుకలు కొరికిన ఘటన చోటు చేసుకుంది. విద్యార్థినులు కీర్తన, దేవి, హృతిక, సింధు, వైష్ణవి, నిఖిత, అంజలి, మహేశ్వరితోపాటు రాత్రి విధులు నిర్వహించే ఉపాధ్యాయులను సైతం ఎలుకలు కొరికాయి. దీంతో గాయపడ్డ వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించినట్లు ప్రత్యేకాధికారి సునీతారాణి తెలిపారు. పాఠశాలలో వంట సామగ్రి, విద్యార్థుల ట్రంక్‌పెట్టెలు, సామగ్రి కారణంగా ఎలుకలు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. ఎలుకల కట్టడికి గదుల్లో బోన్లను ఏర్పాటు చేశామని, మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని ఎస్‌వో సమాధానమిచ్చారు.

కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవా



నర్సాపూర్(జి) : శ్రమదానం చేస్తున్న యువకులు

దిలావర్‌పూర్: స్వచ్ఛతా హీ సేవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం దిలావర్‌పూర్‌లో అధికారులు పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సమావేశమై డ్రై డే కార్యక్రమాల గురించి వివరించారు. ఎంపీఓ గోవర్దన్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): స్వచ్ఛతా హీ సేవ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రాంపూర్‌లో గ్రామపంచాయతీ ఆవరణలో యువకులు శ్రమదానం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన కోఆర్డినేటర్ ప్రవీణ్, భోజన్న, శ్రీధర్, రామకృష్ణ, సందీప్, గంగారాం, షారుక్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్‌లో ఎంపీడీవో వెంకటరమేశ్ పర్యటించారు. ప్రధాన వీధుల గుండా తిరిగి నిల్వనీటిని పారబోయించి.. పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో సోలమాన్‌రాజ్, కార్యదర్శులు ఉన్నారు.

గ్రామాల్లో పోషకాహారంపై అవగాహన



మల్లాపూర్‌లో ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని ఆరోవార్డు పరిధిలో ఉన్న బర్కత్‌పుర అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, ఏఎన్‌ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్ నారాయణ, ఆశావర్కర్ సుప్రియ, పుష్పలత పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్, పొట్టపెల్లి, వడ్యాల్, రాచాపూర్, బోరిగాం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పోషకాహారంపై అవగాహన కల్పించారు. టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన

మామడ: మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ఆదిలాబాద్‌లోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన శిబిరంలో ప్రతిభ కనబర్చారు. ఆదిలాబాద్ 32టీ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వార్షిక శిబిరాన్ని ఈనెల 14 నుంచి 23 వరకు నిర్వహించారు. పొన్కల్ పాఠశాల నుంచి 45 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు. సాంస్కృతిక పోటీల్లో రుచిత, స్మితిక, హేమలత, క్రీడల్లో లావణ్య, ఫైరింగ్‌లో చరణ్ బహుమతులు సాధించారు. వారిని బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం మైస అరవింద్‌కుమార్,ఉపాధ్యాయులు అభినందించారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



భైంసాలోని ఎస్ఎస్ కాటన్‌లో..



ఖానాపూర్: జయంతిలో పాల్గొన్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు అలివేలు మంగ, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు రాచకొండ సాగర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అయ్యన్న గారి రాజేందర్, చేరికల కమిటీ చైర్మన్ భూపతిరెడ్డి, పుట్నాల సాయినాథ్, సుధాకర్, తోట సత్యనారాయణ, దశరథ్ పోశెట్టి, లత పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో బీజేపీ పట్టణ, మండలశాఖ ఆధ్వర్యంలో బుధవారం పండిట్ దీన్‌దయాళ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, మండల మహిళాధ్యక్షురాలు సుష్మా రెడ్డి, అల్లెం దిలీప్, లింగురాం, వేణు, తదితరులున్నారు.

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ గ్రామంలో బుధవారం పండిట్ దీన్ దయాల్ జయంతి ఘనంగా నిర్వహించారు. విఠలరుక్మాయి ఆలయ ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, సుష్మారెడ్డి, భూమేశ్, అశోక్, భోజేందర్, సిద్ధు తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్‌లో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. నాయిని సంతోష్, పడాల రాజశేఖర్, సతీశ్‌రావు, కస్తూరి మహేశ్, గడ్డి సురేశ్, పెద్దులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో దీన్ దయాల్ జయంతి నిర్వహించారు. సంతోష్, ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని దిమ్మదుర్తిలో దీన్‌దయాల్ జయంతిని బీజేపీ నాయకులు నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రావణ్‌రెడ్డి, బీసీ మోర్చా మండలాధ్యక్షుడు సురేందర్‌గౌడ్, భూషన్, నవీన్, వినయ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ముగిసిన శ్రీ రామకోటి పారాయణం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రామాలయంలో శ్రీ శ్రీ శివానంద భారతి స్వామి ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ రామకోటి పారాయణం బుధవారం ముగిసింది. కోటి 15 లక్షల సార్లు రామకోటి పారాయణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయ అభివృద్ధికి సహకరించిన దాతలను భజన మండలి సభ్యులు సన్మానించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

కుంటాల: మండల కేంద్రంలోని సృజన విద్యాలయం నాలుగో తరగతి విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. గ్రామపంచాయతీ, మండల పరిషత్, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, వైద్యశాలకు వెళ్లి అధికారుల విధులను తెలుసుకున్నారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీం, ప్రిన్సిపాల్ కొత్తకాపు గంగన్న, ఉపాధ్యాయులు బి.రమేశ్, చరణ్, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్‌లో ఎల్లమ్మ గుట్టపై ఉన్న ఏళ్లనాటి చింతచెట్టుపై ఏర్పడిన దుర్గమ్మ ప్రతిమ పూజలందుకుంటోంది. భక్తులు సైతం దర్శించుకునేందుకు బారులు తీరుతున్నారు. బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మి ముత్యంరెడ్డి మహాఅన్నదానం ఏర్పాటు చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

ముధోల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ఘటనపై విచారణ జరిపి నిందితులను శిక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూమన్న, బీజేపీ మండల అధ్యక్షులు తాటివార్ రమేశ్, మోహన్‌యాదవ్, సాయినాథ్, లక్ష్మి నారాయణ ఉన్నారు.

పెంబి: తిరుపతి లడ్డూను కల్తీ నెయ్యితో తయారు చేసిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జనసేన, హిందూసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. రాజు, ప్రవీణ్, నరేందర్, సతీశ్, శంకర్, భీమేశ్ తదితరులు ఉన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని వారసంతలో బుధవారం ప్రభుత్వ ఆస్పత్రి, ఐసీటీసీ ఆధ్వర్యంలో ప్రజలకు హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ ఆధ్వర్యంలో 28 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎస్టీఎస్ వేణుగోపాల్, ల్యాబ్ టెక్నీషియన్ అన్వర్, తదితరులు ఉన్నారు.

చెరువులోని వ్యర్థాలను తొలగించాలి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ కుంటలో చికెన్, ఆసుపత్రి వ్యర్థాలను పడేస్తుండటంతో నీరు కలుషితం అవుతోందని.. వెంటనే తొలగించాలని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు దృష్టి సారించి కుంటనీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటేశ్వర్‌రావు, పుప్పాల ఉపేందర్, అడిదెల మహేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేత

లక్ష్మణచాంద: విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు ఆర్థికంగా చేయూతనిస్తున్నట్లు స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రామ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలకేంద్రంలోని ఎస్వీజీ డిగ్రీ కళాశాలలో చదువులో ప్రతిభ కనబరుస్తున్న డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థి హారికకు బహుమతి రూ.నాలుగు వేలను బ్యాంకు రీజనల్ మేనేజర్ రామారావు చేతుల మీదుగా అందజేశారు. మహేశ్వర్‌రెడ్డిని ఆర్‌బీఐ ఏజీఎం రెహమాన్, టీజీబీ రీజనల్ మేనేజర్ రామారావు, ఎల్‌డీఎం రాంగోపాల్ అభినందించారు.

పరిమితికి మించి తీసుకెళ్లొద్దు

దస్తురాబాద్: పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తీసుకెళ్లవద్దని ఎస్సై శంకర్ సూచించారు. బుధవారం దస్తురాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఆటో యూనియన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. ఆటోడ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించడంతోపాటు అన్ని రకాల పత్రాలు కల్గి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ఎస్సైని ఆటో యూనియన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు నరేశ్, తిరుపతి, శేఖర్, నరేశ్, మొయిన్, బషీర్, తిరుపతి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో బుధవారం బాలశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాదవ్ రాంసింగ్, కళాశాల ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెన్నులు, బ్యాగులు పంపిణీ



అడెల్లిలో అందిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: మండలంలోని అడెల్లికి చెందిన మాజీ సర్పంచ్ సముద్రాల సుచరిత-రాజేశ్వర్‌రావు కుమారుడు రాహుల్‌రావు వర్ధంతి సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన 67 మంది విద్యార్థులకు బుధవారం రూ.25వేల విలువైన నోట్‌బుక్‌లు, పెన్నులు, స్కూల్ బ్యాగులు, వాటర్‌బాటిళ్లు, తదితర విద్యా సామగ్రి అందించారు. అనంతరం రవీంద్రనగర్‌తండా ప్రాథమిక పాఠశాలలో బ్యాగులు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు రాజ్‌మహ్మద్, బొల్లోజి నర్సయ్య, మాధవరావు, జగదీశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, నాగయ్య, విలాస్‌రావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులను కళాశాలకు పంపించాలి



భూత్కూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

దస్తురాబాద్: తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటి వద్ద ఉంచకుండా కళాశాలకు పంపించాలని దస్తురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని భూత్కూర్, దస్తురాబాద్ గ్రామాలకు అధ్యాపకులు స్వామి, లక్ష్మీరాజం వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి చదువుతో లాభాలు వివరించారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గ్రామాల బాట పట్టారు. గైర్హాజరవుతున్న నర్సాపూర్(జి), నందన్, రాంపూర్, దర్యాపూర్, లోలం, సిర్గాపూర్, బన్సపల్లి, కంజర్, మాయాపూర్, ముజ్గి, చిట్యాల గ్రామాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రాక్టికల్స్ జరుగుతున్నాయని.. కళాశాలకు పంపాలని కోరారు. ప్రిన్సిపాల్ పి.సుదర్శన్, అధ్యాపకులు జైపాల్, నర్సయ్య పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

తానూరు: మండలంలోని బెంబర, హిప్నెల్లి గ్రామాల్లో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. హిప్నెల్లిలో దీన్ దయాల్ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు వై.చిన్నారెడ్డి, కైలాస్, సాయినాథ్ పటేల్, ఎల్లప్ప, శ్రీనివాస్, లాలుపటేల్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.